మంత్రి వస్తేనే చెక్కులు ఇస్తరా?

- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో జాప్యమెందుకు?
- మంగళవారం ఉదయం 11లోగా ఇవ్వకుంటే తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీకి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమయం ఇవ్వడం లేదంటూ అధికారులు కాలయాపన చేయటం సిగ్గు చేటని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 534 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మంజూరై తహసీల్దార్ కార్యాలయాలకు చేరి నెల గడుస్తున్నా అందజేయక పోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులమతాలు, ప్రాంతీయత, రాజకీయాలకు తావు లేకుండా గడిచిన పదేళ్లలో ప్రభుత్వ పథకాలను అందరికీ అందించామని గుర్తు చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాను గతంలో చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని కూడా లబ్ధిదారులకు భోజనాలు పెట్టి పండుగ వాతావరణంలో పంపిణీ చేశామన్నారు. గత ప్రభుత్వం లక్ష రూపాయల చెక్కులు అందిస్తే, ఈ ప్రభుత్వం తులం బంగారం అదనంగా ఇసామని హామీ ఇచ్చిందన్నారు. తులం బంగారం ఇవ్వకపోగా.. సిద్ధంగా ఉన్నా చెక్కులను లబ్ధిదారులకు ఇవ్వకుండా రాజకీయాలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పేదలకు మేలు చేకూర్చడమే ధ్యేయం అయినప్పుడు ఎవరు పంపిణీ చేస్తే ఏముందన్నారు. ఆన్‌లైన్‌లో ఎమ్మెల్యే వద్ద చెక్కులు పెండింగ్‌లో ఉన్నట్లు చూపడంతో ప్రతి రోజూ అనేక మంది కార్యాలయానికి వచ్చి అడిగి వెళ్తున్నారని తెలిపారు. నియోజకవర్గాల్లో ప్రభుత్వ పథకాల పంపిణీ ఎమ్మెల్యే ద్వారా చేపట్టాలని హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ ప్రభుత్వం మాత్రం రాజకీయాలకు చోటు కల్పించటం బాధాకరమన్నారు. మంగళవారం ఉదయం 11 గంటల వరకు చెక్కులను పంపిణీ చేయకపోతే తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

బ్లాక్ మెయిల్ రాజకీయాలు తగవు

కూకట్‌పల్లి: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ విషయంలో బ్లాక్ మెయిల్ రాజకీయాలు తగవని కాంగ్రెస్ ఏ బ్లాక్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎం. యుగంధర్ రెడ్డి అన్నారు. అధికారులు చెక్కులను పంపిణీ చేసే వరకు ఎమ్మెల్యే ఆగకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. చెక్కులు అందించడంలో అధికారులు అన్నీ సరి చేసుకొని పంపిణీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ పథకాలను పేదలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

కార్తీకమాస వన భోజన మహోత్సవం


వన భోజన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే వివేకానంద్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి వివేకానందనగర్ సీతారామ దేవాలయం వద్ద కూకట్‌పల్లి కౌండిన్య (గౌడ) సేవా సమితి నిర్వహించిన కార్తీక వన భోజన మహోత్సవానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ కులస్తుల అభ్యున్నతికి కృషి చేసిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. రానున్న రోజుల్లో గౌడల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కౌండిన్య సేవా సమితి అధ్యక్షులు పులి గాంధీ సుబ్బారావు గౌడ్, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ గౌడ్, సత్యం బాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కుక్కుటేశ్వర ఆలయంలో లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో కార్తీక మాస శ్రీ మహా లింగేశ్వర స్వామి పూజా కార్యక్రమం, వనభోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురు స్వామి పాల్గొని పూజలు చేశారు.


లింగాయత్‌ల కార్తీకమాస పూజా కార్యక్రమంలో పాల్గొన్న రాజేశ్వరరావు తదితరులు

కిడ్జీ మౌంట్ లిటేరలో..

మూసాపేట: మూసాపేట ప్రగతి నగర్‌లోని కిడ్జీ మౌంట్ లిటేర పాఠశాలలో సోమవారం కార్తీక మాసం చివరి వారం సందర్భంగా కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రావణి మాట్లాడుతూ.. భోజనాన్ని ఇతరులతో పంచుకోవడంతో వారి స్నేహ భావం పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డిసెంబర్ 6 నుంచి బాలోత్సవం పేరిట పోటీలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్లానిటరీ సొసైటీ డైరెక్టర్ రఘునందన్ తదితరులు

గచ్చిబౌలి: విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు డిసెంబర్ 6,7 తేదీల్లో బాలోత్సవం పేరిట వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు ప్లానిటరీ సొసైటీ డైరెక్టర్ రఘునందన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గచ్చిబౌలి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాలల జాతర ఉంటుందన్నారు. వివిధ పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్, ఫోక్ గ్రూప్ డ్యాన్స్, సాంగ్స్, సోలో సింగింగ్, డ్రామా స్కిట్ తదితర పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ సభ్యులు ఆర్.సాంబశివరావు, బాలోత్సవం కన్వీనర్ విజయ్ కుమార్, సభ్యులు రవీందర్, కుర్ర అనిల్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు అండగా సందయ్య ట్రస్ట్


విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్

చందానగర్: నిరుపేద విద్యార్థులకు సందయ్య మెమోరియల్ ట్రస్ట్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. చందానగర్‌లోని సరస్వతి విద్యా మందిర్ విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ట్రస్ట్ సెక్రటరీ రవికుమార్ యాదవ్‌తో కలిసి సోమవారం విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేటా ట్రస్ట్ ద్వారా వందలాది మంది నిరుపేద విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ అందిస్తున్నామన్నారు. విద్యార్థులంతా లక్ష్యంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నరేంద్ర ప్రసాద్, నవతారెడ్డి, లక్ష్మారెడ్డి, రమేశ్, రాజు శెట్టి, రామచందర్, వెంకటస్వామి రెడ్డి, రమణయ్య, శ్రీనివాస్ యాదవ్, సీతారామరాజు, రాజేశ్, సత్యనారాయణ రాజు, క్రాంతి, ప్రభాకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివాలయాల్లో కార్తీక పూజలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- సామూహిక అర్చనలు, అభిషేకాలు


పాండురంగనగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలోని శివాలయంలో..


వి. రామారావునగర్ శివాలయంలో స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

మోతీనగర్: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా అల్లాపూర్, మూసాపేట డివిజన్‌లలోని పలు శివాలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచి ఆలయాలకు తరలి వెళ్లారు. శివాలయాలు శివనామ స్మరణతో మారుమ్రోగాయి. మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలోని శివాలయంలో సామూహిక అర్చనలు నిర్వహించారు. అదే విధంగా కబీర్‌నగర్, మోతీనగర్, అవంతినగర్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీ శివరామ ఆంజనేయ దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు దర్శనం ఇచ్చారు. అల్లాపూర్ డివిజన్‌లోని వి. రామారావు నగర్ శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా పర్వతవర్ధిని శివాలయంలో శివనామ స్మరణతో భక్తులు పూజలు నిర్వహించారు.

హరిహర క్షేత్రంలో పూజలు..

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో కార్తీక మాసం నాలుగవ సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కృష్ణ సూరి సమక్షంలో ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు.




శ్రీ శివరామ ఆంజనేయ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు


వి. రామారావు నగర్ శివాలయంలో ప్రత్యేక అలంకరణలో..

యువకుడి అదృశ్యం


కాశిక్‌రెడ్డి

మియాపూర్: యువకుడు అదృశ్యమైన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండకు చెందిన ఆదిరెడ్డి, కల్పన దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి మియాపూర్‌లోని నాగార్జున ఎన్‌క్లేవ్ కాలనీలో నివాసముంటున్నారు. కుమారుడు కట్ట కౌశిక్ రెడ్డి (21) స్థానికంగా బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండేళ్లుగా గేమ్స్ ఆడుతూ డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు గమనించి 2 నెలల కింద గేమ్స్ మాన్పించేందుకు రీహబ్లీటేషన్ సెంటర్‌లో చేర్పించారు. తర్వాత కొన్ని రోజుల పాటు గేమ్స్ ఆడడం ఆపాడు. మళ్లీ తల్లిదండ్రులకు తెలియకుండా గేమ్స్ ఆడడం మొదలు పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కౌశిక్‌ను మందలించారు. ఈ నెల 19న ఉదయం కాలేజీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల దగ్గర గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆందోళన చెందిన తల్లి కల్పన మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత


చెక్కునందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అల్లాపూర్ డివిజన్‌కు చెందిన ఈ. సాయిరామ్‌కు రూ. 75 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు లబ్ధిదారుడికి అందజేశారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకోవాలి

- క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్

ఫిలింనగర్: క్రిస్టియన్ సంఘాలన్నీ ఐక్యతతో ఉండి క్రైస్తవుల హక్కులు సాధించడంతో పాటు సమస్యలు పరిష్కరించుకోవాలని తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. ఫిలింనగర్‌లోని ఆయన నివాసంలో తెలంగాణ క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి. పీటర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సోమవారం ఆయనను కలిసి క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. చాలా చోట్ల క్రైస్తవులపై దాడులు జరుగుతున్నా కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని వివరించారు. మరో వైపు ప్రభుత్వం నుంచి క్రైస్తవులకు రావాల్సిన పథకాలు, రాయితీలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో పెద్ద సంఖ్యలో క్రిస్టియన్లు శ్మశాన వాటికల స్థలం గురించి ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్నామని, ప్రభుత్వం గుర్తించి స్పందించాలని కోరారు. దీనికి దీపక్ స్పందిస్తూ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, వచ్చే నెలలో గ్రేటర్‌లోని ప్రతి డివిజన్‌లో క్రిస్మస్ ఫెస్ట్‌లు నిర్వహిస్తున్నామని, ఎల్బీ స్టేడియంలో నిర్వహించే క్రిస్మస్ ఫెస్ట్‌లో సీఎం కూడా పాల్గొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో జె ప్రశాంత కుమార్, కె.దిలీప్ కుమార్, బి. కిషోర్, కె.స్వాతి, ఆంటోని దాస్, రెవరెండ్ జీవానందం, సరోజ భాస్కర్, రోజా గంధం తదితరులు పాల్గొన్నారు.

సగరుల అభ్యున్నతికి నిరంతర కృషి


కార్యక్రమానికి హాజరైన మహిళలతో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి రంగారావు తదితరులు

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: సగరుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర నగర్‌లోని సగర సంఘం కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు భవనాన్ని కార్పొరేటర్ రోజాదేవి రంగారావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కులాలు, అన్ని వర్గాల శ్రేయస్సు కోసం ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. కుట్టు శిక్షణ కేంద్రానికి కుట్టు మిషన్లు ఇవ్వాలని సగర సంఘం మహిళలు ఎమ్మెల్యేను అభ్యర్థించగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. అదే విధంగా సగర మహిళా భవనం నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో సగర ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఆస్కానీ మారుతి సాగర్, జగద్గిరిగుట్ట సగర సంఘం అధ్యక్షులు ఆస్కానీ కొండయ్య సాగర్, జగద్గిరిగుట్ట సగర సంఘం ప్రధాన కార్యదర్శి ఆస్కానీ శ్రీనివాస్ సగర్, కోశాధికారి కొమ్ముల రాజేష్ సగర్, సగర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ఎఫ్ చెక్కునందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా

ఆల్విన్‌కాలనీ: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. రూ.71 వేల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా క్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓయూకు గ్రూప్‌-4 ఉద్యోగులు

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్‌-4కు ఎంపికైన ఉద్యోగులలో 375 మంది ఓయూకు రానున్నారు. యూనివర్సిటీ చరిత్రలో నాన్‌టీచింగ్ ఉద్యోగులను తొలిసారి గ్రూప్‌-4 ఎంపికైన ఉద్యోగులతో భర్తీ చేస్తున్నారు. ఇదివరకు నాన్‌టీచింగ్ ఉద్యోగాలను ఓయూ అధికారులు నియమించారు. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నియామకాల నిబంధనలు మార్చింది. దీంతో గత 26 సంవత్సరాలుగా ఓయూలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులు నిరాశ చెందుతున్నారు. గ్రూప్‌-4 ఉద్యోగుల రాకతో తమను ఉద్యోగాల నుంచి తొలగిస్తారేమోనన్న గుబులు కాంట్రాక్టు ఉద్యోగుల్లో కొత్తగా మొదలైంది. వీసీ ప్రొ.కుమార్ ఓయూ కాంట్రాక్టు ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని కోరుతున్నారు.

దివ్యాంగుల హామీలు అమలు చేయాలి



సాక్షి,సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలో భాగంగా దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలకు పెన్షన్ పెంచి వెంటనే అమలు చేయాలని ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షన్ పెంచేందుకు డబ్బులు లేవని చెప్తూనే మరోవైపు కమీషన్లు వచ్చే ప్రాజెక్టులకు లక్షల కోట్లు ఎలా కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో పెన్షన్ పెంపు కోసం 44 లక్షల మంది ఆసరా లబ్ధిదారులు, కొత్త పెన్షన్ మంజూరు కోసం 24.85 లక్షల మంది అర్హులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగిస్తూ గత ప్రభుత్వం జీవో 34 ఇచ్చిందని, దాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. జిల్లా కేంద్రాల్లో నిరుద్యోగ దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ అమలు చేయడానికి అసెంబ్లీలో చట్టం చేయాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ గౌతమ్, డీఆర్‌ఓ హరిప్రియకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్డీ జిల్లా నాయకులు చంద్రమోహన్, మల్లేష్, బాలయ్య, శివ, గంగారెడ్డి, చంద్రయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: వివిధ సమస్యలపై ప్రజలు అందించిన 67 ఫిర్యాదులను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ స్వీకరించారు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, చెరువులు, కుంటల పరిరక్షణపై జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు రాత పూర్వకంగా వినతులను సమర్పించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక సాయం వంటి పథకాల కోసం ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి, పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలపై ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బొల్లు శ్రీనివాస్‌రావు సంఘం సభ్యులతో కలిసి సోమవారం పలు సమస్యలపై కార్పొరేటర్ సబిహా బేగంకు వినతిపత్రం అందజేశారు. సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, కమ్యూనిటీ హాల్ అదనపు ఫ్లోర్, నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ పోల్స్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయాలని కాలనీ వాసులు కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమస్యలను ఎమ్మెల్యే కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మధు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్స్ ట్రెనింగ్)లో పండిత్ జష్‌రాజ్ 52వ పండిత్ మోతీరాం పండిత్ మనీరాం సంగీత్ సమారోహ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిషి, మహిళా ఉపాధ్యాయులు పాకవజ డ్యూయోట్‌ను, నటీ శోభన భరతనాట్య ప్రదర్శన, అభిషేక్ రఘురాం కర్ణాటక సంగీతంతో ఆకట్టుకున్నారు.

సెంట్రల్ విశ్వవిద్యాలయాల ఏబీవీపీ జాతీయ కన్వీనర్‌గా కనుకాటి బాలకృష్ణ



రాయదుర్గం: తెలంగాణకు చెందిన హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థికి అరుదైన అవకాశం లభించింది. నల్గొండ జిల్లా చింతపల్లి మండలంలోని బడ్డమ వరిగూడెం గ్రామానికి చెందిన కనుకాటి బాలకృష్ణ ఉత్తరప్రదేశ్‌లోని ఖరగ్‌పూర్‌లో నిర్వహించిన జాతీయ సమావేశాల్లో ఏబీవీపీ కేంద్ర విశ్వవిద్యాలయాల కార్యాలయాల జాతీయ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. బాలకృష్ణ ప్రస్తుతం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జర్నలిజంలో పీహెచ్‌డీ (పరిశోధక విద్యార్థి)గా చేస్తూ హెచ్‌సీయూ ఏబీవీపీ అధ్యక్షుడిగాబాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సెంట్రల్ యూనివర్సిటీల్లో ఏబీవీపీ కార్యకలాపాలను సమన్వయం చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా సెంట్రల్ యూనివర్సిటీల జాతీయ కన్వీనర్‌గా బాలకృష్ణకు అవకాశం రావడంపై హెచ్‌సీయూ ఏబీవీపీ నాయకులు ఆయనను అభినందించారు. జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు వచ్చేలా పనిచేయాలని వారు ఆకాంక్షించారు.


మానసాదేవి హోమంలో సినీహీరో సుమన్



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్‌లోని పట్టాభి రామాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణములోని గౌరీ శంకర స్వామి ఆలయంలో సోమవారం మానసాదేవి హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సినీ హీరో సుమన్, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్, బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ సెక్రెటరీ ధనరాజ్‌యాదవ్, అరవింద్, వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, రాములు, రవీందర్, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమామహేశ్వర కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు



సుభాష్‌నగర్: నూరారంలోని ఉమా మహేశ్వరాలయంలో ఆఖరి సోమవారం సందర్భంగా ఉమామహేశ్వర కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ మహోత్సవానికి హంపీ పీఠాధిపతులు విద్యారణ్య భారతి స్వామీజీ, రేరా చైర్మన్ సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్, కబడ్డీ


విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

సనత్‌నగర్: కుందూరు రంజిత్‌గౌడ్ స్మారక క్రికెట్, కబడ్డీ పోటీలు సనత్‌నగర్‌లోని జీహెచ్ఎంసీ క్రీడా మైదానంలో ఉత్సాహంగా జరిగాయి. బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గోవింద్ రాథోడ్, మహంకాళి-సికింద్రాబాద్ జిల్లా గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ్లు సాయిరాథోడ్ బృందం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. జూనియర్ కళాశాలల నుంచి క్రికెట్‌లో 70 జట్లు, కబడ్డీలో 30 జట్లు పాల్గొన్నాయి. 9 ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల క్రికెట్‌లో విజేతగా నిలవగా, శ్రీఆద్య జూనియర్ కళాశాల రన్నరప్‌గా నిలిచింది. కబడ్డీలో శ్రీచైతన్య మొదటి స్థానంలో నిలవగా, అక్షర జూనియర్ కళాశాల రన్నరప్‌గా నిలిచింది.